క్లుప్తంగా

ఎర్ర రాళ్ల తవ్వకాలపై దాడులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గణేష్‌పూర్ గ్రామ శివారులో అక్రమంగా కొనసాగుతున్న ఎర్ర రాళ్ల తవ్వకాలపై బుధవారం రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో ఇటాచీ, టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అధికారులు వస్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్న కొందరు తవ్వకాల నిర్వాహకులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భానుకిరణ్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఎర్ర రాళ్ల తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

జహీరాబాద్: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని షాహీన్ విద్యాసంస్థలో బుధవారం నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండి ఉన్నత విద్యనభ్యసించినప్పుడే తమకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న వారవుతారన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో షాహీన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ పుర్కాన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్లేట్లు, వాటర్‌బాటిళ్లు పంపిణీ



ప్లేట్లు, వాటర్‌బాటిళ్లను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయురాలు సరిత

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌలాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్లను ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు సరిత బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సరితను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించండి

పుల్‌కల్(అందోల్): సీనియర్ అసిస్టెంట్‌లు, ఆర్టిజన్‌లకు పదోన్నతులు కల్పించాలని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు చీఫ్ ఇంజినీర్ రమేష్‌బాబుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న ఆపరేషన్, మెయింటెన్స్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో విద్యుత్ సంఘం నాయకులు ప్రభాకర్, కిరణ్‌కుమార్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

దర్గాలో జెడ్పీటీసీ పూజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ గ్రామ శివారులోని ఉర్సే షరీఫ్ పిర్ గైబ్ సాహెబ్ దర్గాలో జాతర కొనసాగుతోంది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ స్వప్న దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇసాంపటేల్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఎంపీడీఓకు వీడ్కోలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం ఎంపీడీఓగా రాములు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన సందర్భంగా ఎంపీపీ కార్యాలయంలో బుధవారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవీందర్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, అధికారులు ఎంపీడీఓ రాములును ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన అరుణకు స్వాగతం పలికారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి, చిట్కుల్, బచ్చుగూడెం, ఇంద్రేశం, పోచారం, రామేశ్వరంబండ, ఐనోల్, చిన్న కంజర్ల, పెద్ద కంజర్ల గ్రామాల్లో బుధవారం సీసీ రోడ్డు పనులకు పటాన్‌చెరు ఎంపీపీ సుష్మశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరిగౌడ్, పంచాయతీ మండల అధికారి హరిశంకర్‌గౌడ్, ఆయా గ్రామాల కార్యదర్శులు దయానంద్, కవిత, భవాని ప్రజాప్రతనిధులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణమా.. డంపింగ్ యార్డా?

ఆటస్థలాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం

- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- వినియోగంలోకి తేవాలని క్రీడాకారుల విజ్ఞప్తి



క్రీడా ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

జిన్నారం(పటాన్‌చెరు): యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో మెరుగైన శిక్షణతో పాటు యువతకు ప్రోత్సాహం ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కానీ.. అధికారులు క్రీడాప్రాంగణ నిర్వహణ పట్టించుకోకపోవడంతో ఆటస్థలాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది. విలువైన క్రీడా పరికరాలు తుప్పుపట్టి మూలనపడ్డాయి. ఫలితంగా ఎంతోమంది క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై యువత అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది.

జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డులో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. కానీ.. కేవలం ఆరు క్రీడాప్రాంగణాలను మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ ఆరు క్రీడా ప్రాంగణాల నిర్వహణ సరిగా ఉందా అంటే అది కూడా లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రాంగణంలో చెత్తాచెదారం పేరుకుపోయి డంపింగ్ యార్డులను తలపిస్తూ దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి.

ఆదాయం ఉన్నా.. ఫలితం శూన్యం



బొల్లారం మున్సిపాలిటీకి ప్రతి ఏటా సుమారు రూ.12కోట్ల ఆదాయం వస్తోంది. కానీ.. కాలనీల్లో ఏర్పాటు చేసిన క్రీడామైదానాల నిర్వహణను పట్టించుకోవడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంతేకాకుండా క్రీడామైదానాల నిర్వహణ పేరుతో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై నిధులు కాజేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రతి సమావేశంలో అధికారులు నిధులు కేటాయిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. క్రీడాప్రాంగణాలు చెత్తతో నిండిపోతుండటంతో అధికారుల పనితీరుపై క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్రీడామైదానాల్లోని చెత్తాచెదారం తొలగించి వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపాలిటీ ప్రజలు, క్రీడాకారులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



క్రీడా ప్రాంగణంలో పూర్తిగా చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ఆటలు ఆడుకునేందుకు వీలు లేకుండా పోతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి క్రీడాప్రాంగణాలను వినియోగంలోకి తేవాలని కోరుతున్నాం.
– విజయ్, బొల్లారం

వినియోగంలోకి తెస్తాం

మున్సిపాలిటీ పరిధిలోని ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన క్రీడామైదానాల్లో చెత్తాచెదారం పేరుకుపోయిన విషయం తన దృష్టికి రాలేదు. తక్షణమే చెత్తను తొలగించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువచ్చేవిధంగా చర్యలు తీసుకుంటాం.
– నిర్మల, మున్సిపల్ మేనేజర్, బొల్లారం

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): డీసీసీబీ డైరెక్టర్, ప్రముఖ న్యాయవాది, కల్హేర్ మండల పరిధిలోని బీబీపేటకు చెందిన గుండు వెంకట్‌రాములు ఔదర్యం చూపారు. మహారాష్ట్రలోని ప్రముఖ పుణక్షేత్రం పండరిపూర్‌లోని తమ తల్లిదండ్రులు గుండు రామయ్య-లచ్చమ్మ జ్ఞాపకార్థం సొంతంగా రూ.5 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి అంతర్‌గాం గజేంద్ర ఆశ్రమం పీఠాధిపతి కరణ్ గజేంద్రభారతి మహారాజ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం గుండు వెంకట్‌రాములు చూపిన ఔదర్యం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నువ్వుల సత్యమ్మ, రవిపాటిల్, భక్తులు పాల్గొన్నారు.

పంచగవ్యతో మొక్కలకు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వట్‌పల్లి(అందోల్): సేంద్రియ ఉత్పత్తి మొక్కల పెరుగుదలతో పాటు రోగనిరోధక శక్తిని అందించేందుకు పంచగవ్య ఎంతో మేలు చేస్తుందని ఏరువాక కేంద్రం విద్యార్థులు అన్నారు. ఈ మేరకు వట్‌పల్లిలో బుధవారం పంచగవ్యపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవు పేడ, ఆవు మూత్రం, పాలు, పెరుగు, బెల్లం, నెయ్యి, అరటిపండు, లేత కొబ్బరి కలిపి పంచగవ్యను తయారు చేసుకోవడంత ద్వారా పర్యావరణ అనుకూలమైన ఆరోగ్యకరమైన మొక్కల పెరుగుదలకు బలం చేకూరుతుందన్నారు. అంతేకాకుండా మొక్కల్లో తెగుళ్ల నివారణకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు అమన్, శివ, వికాస్, ప్రశాంత్, మోహన్, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

గ్రామకంఠం భూమిపై విచారణ జరిపించాలి



గ్రామకంఠం భూమిని చూపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని సాదులనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని పాత పంచాయతీ పక్కన ఉన్న గ్రామకంఠం స్థలాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రె కృష్ణ అక్రమించాడని, వెంటనే విచారణ జరిపించాలని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ నాయకులు గ్రామకంఠం భూమిని బుధవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాత గ్రామ పంచాయతీ పక్కన ఉన్న 12 గంటల గ్రామకంఠం భూమిని ఆక్రమణకు గురైందని, ఇట్టి భూమిని సాధునగర్ గ్రామపంచాయతీ పరిధలో ఉన్న పేదలకు ఇవ్వాల్సి ఉండగా ఇటీవల కొందరి నాయకుల అండదండలతో కర్రె కృష్ణ కబ్జా చేశాడని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామకంఠ భూమిని కాపాడేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సాధువులనగర్ మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, మాజీ వార్డుసభ్యుడు మొగులయ్య, నాయకులు వీరేశం, రామరాజు, తలారి భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని బోర్గి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గ్రామ శివారులో హరిత హారం కోసం పెంచుతున్న నర్సరీ, ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ సత్తయ్య బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ నర్సింహులు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి అరుణ్ తదితరులు ఉన్నారు.

మహిళ అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: మహిళ అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన సుభాష్ ముడీ, తుంప పాత్ర బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం వచ్చి పాశమైలారంలో ఉంటున్నారు. సుభాష్ ముడీ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుండగా, అతడి భార్య తుంప పాత్ర పాశమైలారంలోని వాసుదేవా హోటల్లో పని చేసుకుంటూ జీవం సాగిస్తోంది. రోజు మాదిరిగానే మంగళవారం హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన తుంబ పాత్ర హోటల్‌కి వెళ్లి అక్కడి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో సుభాష్ ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య అదృశ్యంపై భర్త సుభాష్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

100 శాతం పన్నులు వసూలు చేయండి

మునిపల్లి(అందోల్): 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఎంపీడీఓ హరినందన్ రావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీపీ సర్వసభ్య సమావేశ మందిరంలో బుధవారం ఉపాధి హామీ, నర్సరీలు, శానిటేషన్, ఇంటి పన్నుల వసూలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య రాకుండా చూసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులదేనని తెలిపారు. నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాని సూచించారు.



తాపీమేస్త్రీకి బహుమతి ప్రదానం చేస్తున్న భారతి సిమెంట్ మార్కెటింగ్ సభ్యులు

నిర్మాణంలో మేటి భారతి సిమెంట్

- టెక్నికల్ సర్వీస్ మేనేజర్ సునీల్
- నూతన సాంకేతిక వరవడితో దూసుకెళ్తున్న భారతి సిమెంట్

సంగారెడ్డి టౌన్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూపునకు చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని, వికాట్ గ్రూప్ కంపెనీలు ప్రపంచంలోని 12 దేశాల్లో విస్తరించి ఉన్నాయని టెక్నికల్ సర్వీసెస్ మేనేజర్ సునీల్ తెలిపారు. సంగారెడ్డిలోని శ్రీసాయి బాలాజీ ట్రేడర్ ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలతో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవడమే కాకుండా నిర్మాణం ధృడత్వంగా ఉంటుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. నిర్మాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం తాపీమేస్త్రీలకు రూ.లక్ష విలువచేసే ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. సమావేశంలో చీఫ్ మేనేజర్ మార్కెటింగ్ సతీశ్ కుమార్, అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ గంగాధర్‌రెడ్డి, ఆఫీసర్ టెక్నికల్ సర్వీసెస్ ప్రశాంత్, డీలర్ కృష్ణకాంత్, నవీన్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. స్థానికులకు శాపం

- మురుగు కాలువపై పైకప్పులేని వైనం
- ప్రమాదాలకు నిలయంగా ఓపెన్ నాలా
- చోద్యం చూస్తున్న అధికారులు



మురుగునీటి కాలువలో పడిన వ్యక్తి (ఫైల్)

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే సిద్దాపూర్‌గొని రహదారికి ఆనుకొని ఉన్న పెద్ద మురుగునీటి కాలువ (నాలా) ప్రమాదకరంగా మారింది. దీంతో స్థానిక ప్రజలు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు ఈ మురుగునీటి కాలువలో పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని రక్షించి సురక్షితంగా బయటకు తీశారు. మురుగునీటి కాలుపై పైకప్పు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతేడాది కొల్కూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు ఈ మురుగునీటి కాలువలో పడి ఊపిరాడక దుర్మరణం చెందాడు. అయినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ మురుగునీటి కాలువ ఆనుకొని పెద్ద మర్రిచెట్టు ఉండటంతో నీడ కోసం వచ్చి ఈ కాలువ కట్టపై కూర్చుంటారు. ఈ క్రమంలో ఎంతోమంది ప్రమాదవశాత్తు కాలువలో పడి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సిద్దాపూర్‌గొని రహదారికి ఆనుకొని ఉన్న ఈ మురుగునీటి కాలువపై పైకప్పు నిర్మించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తాం



మాట్లాడుతున్న కెనరా బ్యాంక్ నిజామాబాద్ రీజినల్ హెడ్ శ్రీనివాస్

జహీరాబాద్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని కెనరా బ్యాంక్ నిజామాబాద్ రీజినల్ హెడ్ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని మల్‌చల్మ గ్రామంలో కెనరా బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకులు గ్రామీణ ప్రాంతాల్లోని రైతులతో పాటు వ్యాపారస్తులకు రుణ సదుపాయం కల్పిస్తున్నాయని తెలిపారు. వ్యాపారాలు, వాహనాల కొనుగోళ్లు, విద్యనభ్యసించేందుకు వీలుగా రుణాలను కూడా ఇస్తున్నామని వివరించారు. బంగారు ఆభరణాలపై సైతం రుణాలను పొందచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ గోపాల్‌రెడ్డి, జహీరాబాద్ చీఫ్ మేనేజర్ బీమా రాఘవేందర్, మల్‌చల్మ బ్రాంచ్ మేనేజర్ అరవింద్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

గురుకుల ప్రిన్సిపాల్ సాయిలత



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

జోగిపేట(అందోల్): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అందోలు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలత అన్నారు. గురుకులాన్ని వీడుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినులు ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ సాయిలతను పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ రత్నరాజు, వైస్ ప్రిన్సిపాల్స్ అజమత్‌బేగం, స్వర్ణలత, పోషకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కాంగ్రెస్‌లో చేరిక**

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఎనక్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రకాశ్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్‌షెట్కార్, నాగల్‌గిద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణిక్‌రావు, నాయకులు విఠల్‌రెడ్డి, టొర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి**

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని పలు ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం ఎంఈఓ విశ్వనాథంకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు సీహెచ్‌అశోక్, సతీష్, తెంకటి కుమార్, పవన్, ఇసాక్, లింగయ్య ఉన్నారు.

◆ **ఆకులపై అవగాహన**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్ (కే) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థులు బుధవారం ప్రకృతిలోని వివిధ రకాల చెట్ల ఆకులను సేకరించి పాఠశాలలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆకుల రంగు, రుచి, వాసన, ఆకారాలు, వాటి స్వభావం, లాభాలను ఉపాధ్యాయుడు డాక్టర్ రామకృష్ణ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురార్జి, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **సీపీఐలో చేరిక**

నారాయణఖేడ్: సీఐటీయూ, సీపీఎంలో 15 ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేసిన ఖేడ్‌కు చెందిన సాతిని చిరంజీవి ఆ పార్టీలకు రాజీనామా చేసి బుధవారం హైదరాబాద్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా చిరంజీవి సాంబశివరావును సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

◆ **ఘనంగా అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం**

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ బాలుర మైనార్టీ గురుకులంలో బుధవారం అంతర్జాతీయ మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రామిక విజ్ఞాన కేంద్రం నిర్వాహకురాలు, డాక్టర్ విజయలక్ష్మి హాజరై మాతృ భాష గొప్పతనాన్ని వివరించారు. గురుకుల ప్రిన్సిపాల్స్ రాములు, జమీల్, కోఆర్డినేటర్లు రహీం, నాగార్జున, శ్రీనివాస్, సమీయుద్దీన్, ఇర్ఫాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **ఓవర్‌లోడ్‌ను నివారించండి**

జిన్నారం(పటాన్‌చెరు): కంకర క్రషర్‌ల నుంచి కంకరను తరలిస్తున్న టిప్పర్‌లు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నాయని, దీన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీఏ కమీషనర్ వెంకటరమణకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భీమా , ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

◆ **బ్యాంక్ సేవలతో లబ్ధి పొందాలి**

కంగ్టి(నారాయణఖేడ్): ఖాతాదారులు బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఏపీజీవీబీ ఏజీఎం, ఆర్‌ఎం ఎస్‌ఎల్‌ఎస్ ప్రసాద్ అన్నారు. కంగ్టిలో ఏపీజీవీబీ నూతన బ్రాంచ్‌ను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అడ్మిన్ సుబ్బారావు, పీఓ(ఐటీ) దిలీప్, బ్రాంచ్ మేనేజర్ శ్యాం రాహుత్, ఎంపీపీ సంగీత వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

◆ **మొక్కలు ఎండిపోకుండా చూడాలి**

కంది(సంగారెడ్డి): వననర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. కంది మండల పరిధిలోని తోపుగొండ, చెర్లగూడెం, కలివేముల గ్రామాల్లో వన నర్సరీలను మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ మహేదర్‌రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వన సేవకులు ఉన్నారు.

◆ **కార్మికుల హక్కులపై అవగాహన**

సంగారెడ్డి: మెద్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెద్వాన్ కార్యాలయంలో మానఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఇండ్లల్లో పని చేస్తున్న గృహ కార్మికులకు హౌసింగ్ రైట్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ప్రముఖ న్యాయవాది విఠల్‌రెడ్డి, డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, మెద్వాన్ కోఆర్డినేటర్స్ స్వప్న, మెద్వాన్ సమీర్ పాల్గొన్నారు.

◆ **ఉపాధ్యాయులకు శిక్షణ**

జహీరాబాద్: ఉపాధ్యాయులు విద్యార్థులను మానసికంగా ధృఢంగా ఉండేలా తీర్చిదిద్దాలని మానసిక వైద్యురాలు నిర్మల, ఆర్‌సీఓ భీమయ్య అన్నారు. మండలంలోని రంజోల్ గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆయా పాఠశాలలకు చెందిన 50 మంది ఉపాధ్యాయులు, సహ ప్రధానోపాధ్యాయులు వివిధ అంశాలపై శిక్షణ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలితమ్మ, కరస్పాండెంట్ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **రీసైకిల్‌తో ప్రమాదాల నివారణ**

పటాన్‌చెరు టౌన్: ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సమర్థవంతంగా రీ-సైకిల్ చేయడం ద్వారా మానవాళిని ప్రమాదాల నుంచి తప్పించవచ్చని టాస్క్ ట్రైనర్ సుప్రియ అన్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలేజ్) ఆధ్వర్యంలో వేస్ట్ మేనేజ్మెంట్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, కళాశాల కోఆర్డినేటర్ కృష్ణ, ప్రసన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ **వ్యక్తి అదృశ్యం కేసు నమోదు**

రాయికోడ్(అందోల్): వ్యక్తి అదృశ్యంపై అతడి సోదరుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాటూర్ గ్రామానికి చెందిన రఫీ ఈ నెల 19న ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతడి సోదరుడు మన్సూర్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిస్తే 87126 56770ను సంప్రదించాలని సూచించారు.

◆ **సైన్స్‌లో విద్యార్థి ప్రతిభ**

ఝరాసంగం(జహీరాబాద్): ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో బర్దీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి పాండు ఉత్తమ ప్రతిభను కనబర్చాడు. ఈ మేరకు బుధవారం ఉపాధ్యాయులు పాండును ఘనంగా సన్మానించి అభినందించారు.

◆ **సొంత నిధులతో రోడ్డు నిర్మాణం**

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ శివకుమార్‌గౌడ్ బుధవారం సొంత నిధులు రూ.40 లక్షలు వెచ్చించి రాయల్ కాలనీలో నిర్మించనున్న రోడ్డు పనులకు పంచాయతీ కార్యదర్శి సుభాష్, తాజా మాజీ సర్పంచ్ దండు నర్సింలతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా కాలనీవాసులు, నాయకులు శివకుమార్‌గౌడ్‌ను సన్మానించారు.